

నేతకార్మికుడిని పరామర్శిస్తున్న బాబు

# మీ కష్టానికి ఫలితం దక్కుతుందా?

## చేనేత, బీడీ కార్మికులు, గొర్రెల కాపర్లతో ముచ్చటించిన బాబు



కార్యకర్త ఇచ్చిన గొర్రెపిల్లతో చంద్రబాబు

**కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** శుక్రవారం హుజూరాబాద్, కమలాపూర్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన ప్రచార సభల్లో భాగంగా బీడీ, చేనేత కార్మికులను, గొర్రెల కాపర్లను కలుసుకొని వారికి వస్తున్న కూలీతోపాటు కష్టసుఖాలను అడిగి తెలుసుకొని తెదేపా అధికారంలోకి వచ్చాక కష్టాలు లేకుండా చేస్తానని వారికి హామీ ఇచ్చారు. బాబు వారితో ముచ్చటించిన వివరాలిలా ఉన్నాయి...

### శ్రీరాములపల్లిలో చేనేత, బీడీ కార్మికులతో...

**బాబు:** ఏం పెద్దాయన... రోజూ నీకెంత కూలీ గిడుతుంది.

**శాంతయ్య:** నేను రోజు మూడు లుంగీలు తయారు చేస్తాను.

**బాబు:** ఎంత కూలీ గిట్టుబాటు అవుతుంది

శాంతయ్య: 60 రూపాయలు గిట్టుబాటు అవుతుంది.

**బాబు:** మగ్గంపై బాబు కూర్చొని మాట్లాడుతూ రోజంతా కష్టపడితే 60 రూపాయలు కూలీ గిడితే సరిపోతుందా?

**శాంతయ్య:** సరిపోయినా, సరిపోకున్నా సర్దుకోవలసిందే. మా కష్టాలు చూసేవారే లేరు.

**బాబు:** మీ కష్టాలను తెలుసుకొని పరిష్కారం కనుగొనేందుకే నేను వచ్చాను. తప్పకుండా మార్గం చూపిస్తాను.

### బీడీ కార్మికులతో బాబు కూర్చొని...

**బాబు:** అమ్మా... బీడీలు చుట్టడం ద్వారా మీరు నెలకు ఎంత సంపాదిస్తున్నారు.

**కార్మికురాళ్లు:** సార్... నెలలో పది నుంచి పదిహేను రోజులు మాత్రమే పని దొరుకుతుంది. రూ.600 లకు మించి కూలీ గిట్టడం లేదు.

**బాబు:** బీడీ కట్టపై పుర్రె గుర్తును తొలగించేందుకు మేము ఉద్యమించాము. అయినా పని ఎందుకు దొరకడం లేదు.

**కార్మికురాళ్లు:** పని ఎందుకివ్వడం లేదో తెలియడం లేదు.

**బాబు:** పుర్రె బొమ్మను తీసేశారు. పని ఇవ్వనప్పుడు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలి కదా.

**కార్మికురాళ్లు:** మా గురించి పట్టించుకునేవారే లేరు. మాకు పెన్షన్లు ఇప్పించండి. ఇళ్లు ఇప్పించండి. పని చూపండి.

**బాబు:** తప్పకుండా పని చూపిస్తాం. ఆరు నెలలు ఓపిక పట్టండి. పెన్షన్లు ఇవ్వడమే కాకుండా మీ అందరికి లక్ష రూపాయలు ఖర్చయినా ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తాం. గ్యాస్ కనెక్షన్లు ఇస్తాం.

### గొర్రెల కాపర్లతో...

**బాబు:** గొర్రెల కాపరిగా పనిచేస్తే మీకు ఎంత కూలీ ఇస్తారు.

**కాపరి:** సంవత్సరానికి రూ.16 వేలు ఇస్తున్నారు.

**బాబు:** ఎలా సరిపోతున్నాయి

**కాపరి:** భోజనం పెట్టి, జీతం ఇస్తున్నారు.

**బాబు:** సొంత ఇల్లు ఉందా?

**కాపరి:** సొంత భూమిలో ఇల్లు మంజూరు చేశారు. కట్టుకుందామంటే డబ్బులు లేవు. రేట్లు బాగా పెరిగాయి. పైసలు కావాలంటే మూడు రూపాయల వడ్డీ అడుగుతున్నారు.

**బాబు:** ఈ ప్రభుత్వం నిరుపేదలను పట్టించుకోదు. వడ్డీకి డబ్బులు తెచ్చి ఇల్లు కడితే కష్టమే. ప్రభుత్వమే సొంతంగా మీలాంటివాళ్లకు కట్టివ్వాలి. మా ప్రభుత్వం వచ్చాక ఇల్లు కట్టిస్తాం.

ఇంతలోనే ఒక మహిళ చంద్రబాబునాయుడు వద్దకు వచ్చి ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా పత్తి పంట దెబ్బతింది. ఇటుక బట్టీలు నాశనమయ్యాయి. లక్ష రూపాయలు నష్టపోయామని బాబుకు మొరపెట్టుకుంది. మీలాంటివాళ్లకు అండగా నిలువాలని నేను ఈ యాత్ర చేపట్టాను. తప్పకుండా మీకు న్యాయం జరుగుతుంది. ఇలా చంద్రబాబునాయుడు తన యాత్రలో పలుచోట్ల ఆగి ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్నారు.